ఋణానుబంధం

హోరి పిచ్చివాడా అన్నట్టు నవ్వి హోరి పిచ్చివాడా అన్నాడు అప్పారావు. ఎందుకలా భయపడతావు. వీరంతా మనుషులే. మనుషులంతా మంచివాళ్లే. చాలామంది చేబదుళ్లిస్తారు. అదిగో ఆ గుండాయన చూడు, అడగడం తడవు ఇచ్చేస్తాడు. మళ్లీ మనంతట మనం ఇచ్చేదాకా అడగడు. ఆ చారల చొక్కావాణ్ణి చూడు. కనిపిస్తే అప్పుకావాలా అని తనే అడిగేస్తాడు. (ఈ మధ్య మానేశాడు)మనం అడిగినపుడు చేత డబ్బులేకపోతే బెగ్ బారో ఆర్ స్టీల్ చేసయినా ఇస్తాడు. దొంగనోట్లు అచ్చుకొట్టైనా ఇచ్చేస్తాడు. అంత మంచివాడు. అందులోనూ ఎపుడూ అడగని నీలాంటివాడు అడిగితే యివ్వననగలవా డెవడు? అడగడం పరువు తక్కువని భయపడకు. అప్పులు మహా మహావాళ్లు చేశారు. జీవితమే ఓ పెద్ద అప్పు. ధర్మరాజుగారికో రోజున రొక్కం కావలసివచ్చి వేళకి జతపడక భీమసేనుడిని కుబేరుడు దగ్గరకు పంపాడుట అప్పు తెమ్మని. తీరా అతను అందాకా వెళ్లి అడిగేసరికి కుబేరుడేమో మీ అన్న వడ్డీ ఇస్తాడా మరి అన్నాడట. రణరంగంలోనే తప్ప ఋణరంగంలో యేమంత ప్రతిభాశాలిగాని భీముడు తంగున జవాబివ్వలేక మళ్లీ భూలోకం వచ్చేసి, అన్నా వినమని కథ చెప్పాడు. వడ్డీ పుచ్చుకోకపోతే మనం అప్పు పుచ్చుకోము అని చెప్పు అని కబురంపాడు ధర్మరాజు ఎందుకైనా మంచిదని. కుబేరుడు అప్పూ ఇచ్చాడు. వడ్డీ వద్దనీ అన్నాడు. ఈ ట్రిక్కు బలేగా పనిచేస్తుందిలే. అలాగే ఇంకా చరిత్రలో యెన్నో....ఎటు తిరిగినా గొప్పవాళ్లలో అప్పు చెయ్యనివాడెవడు? రాక్ ఫెల్లరుకి యెంత డబ్బున్నా, జేబులో వేసుకుతిరగడుగదా? ఓ అర్థనా బటానీలు కొనబోయినపుడు చెక్కులిస్తే వాడు

పుచ్చుకోడుగదా. అప్ప చెయ్యకేం చేస్తాడు పక్కవాడి దగ్గర? కర్ణుడు, దుర్యోధనుడి దగ్గిర అప్పచేసి దానాలు ఇచ్చేస్తుండేవాడు. హరిశ్చంద్రుడికి ఇరుగుపొరుగు చక్రవర్తుల దగ్గిర అప్ప చెయ్యాలన్న ఊహపోకనే నక్షత్రకుడితో నానా అవస్థలూపడ్డాడు. ఈ అయిడియా తగిల్తే ఆ పని చేసేవాడు కాదంటావా? అసలు అప్పుడుకూడా అపకీర్తి శేషుడు కాగల ప్రమాదంలేదుగా. అప్ప పుట్టించే తాపతూ, పలుకుబడీ ఇవే ఒహడి గొప్పతనానికి గీటురాళ్లు. అప్పంటే ఏమనుకున్నావు..... అదిగో – ఒకాయన పోవడంలే? ఎంత మంచివాడో నే చెప్పలేను. ప్రతీ నెలా నాకైదు అప్పిస్తాడు. నేను 30న తీర్చేస్తా. మళ్ళీ ఫస్టున ఆప్పిస్తాడు.....ఏం, అప్పంటే ఏమనుకున్నావు. మహా పవిత్రమైనది. పంచభూతాలలో ఒకటి. పృథ్వి, అప్ప, తేజస్సు, వాయువు, ఆకాశం అన్నారు. ఇదీవరస. ఏడాది పొడుగునా సముద్రుడి దగ్గిర అప్ప పీల్చేసుకుంటాడు అబ్బుణకిరణాలవాడు. అందుకే ఏడాది తిరిగేసరికల్లా బాకీ తేర్చేస్తాడు వబ్బుణుడు.. తీర్చమని వబ్బుణుడిని కోరేవే బుక్కులు. వీటితోటే వేదాలనే నాలుగు బుక్కులు రాశార్ట. నేనెపుడూ చూడలేదనుకో. కాని మంచి పుస్తకాలే అయుండాలి. విలువైన ముక్క చెబుతున్నప్పుడు మెచ్చుకోక తప్పదుగదా. అదీ సంగతి. లోకమంతా ఇలా ఇచ్చిపుచ్చుకోడాలమీదనే సాగిపోతోంది. అడిగితేనే ఇవ్వడం, ఇస్తేనే పుచ్చుకోవడం, పుచ్చుకుంటేనే మళ్లీ ఇవ్వడం. ఈ మూడూ లేకపోతే జీవితం 'బోరు' కొట్టియ్యదూ? కాబట్టి నా మాటవిని ముందడుగెయ్యి. టైమైపోతోంది. సినిమాకి సెకెండ్ బెల్ కొడుతున్నారు పద అని బుణోపదేశం చేశాడు అప్పారావు.

గుర్నాధం కదల్లేదు. ఏమనుకుంటారో అన్నాడు జంకుగా.

హారినీ! అదా నీ భయం. నీదగ్గర అడ్డమైనవాడూ అప్పచేసి ఎగ్గొట్టా అన్నట్లు నవ్వి ఆ మాటే అన్నాడు అప్పారావు.

నీ కా భయం అక్కరలేదు. అందులోనూ సినిమా కెళ్లడానికి అప్పడగడంలో తప్ప ఏమీలేదు. పై పెచ్చు గొప్ప ఫాషను. ఏదో ఆకలి తీరడానికి, పరువు నిలబెట్టుకోడానికి చేయిజాస్తే తప్ప, సినిమా టిక్కెట్ల కేవుటోయ్. రాజాలాటి కారణం అది. సినిమాలను. సిగరెట్లను. మందను. మాకను. గుర్రప్పందాలను. ఆటను. పేకాటను.–ఇలాటి వాటికి నూటికి నూరు ఛాన్సులూ ఉంటాయి అప్పదొరకడానికి. ఇవ్వలేకపోయినవాడు పశ్చాత్తాపంతో అగ్నిప్రవేశంచేసి అత్మహత్య చేసుకుంటాడు. ఇవ్వగలిగినవాడు ఆనందంతో ఇస్తాడు.

అంతెందుకు, నా అంతవాడికి ఓసారి అర్జెంటుగా ఓ పాతిక కావాల్సి వచ్చింది. అప్పుడే 'అశ్వమేధయాగం' కథ విని ఆనందంతో పొంగిపోయాను. ఎటొచ్చీ మా అమ్మ పొరుగూళ్లోనే అయినా, నిక్షేపంలా ఉన్నందువల్ల టెలిగ్రామూ రెండ్రూపాయల చిల్లరా దొరికితే అది పట్టుకు వీధిని పడ్డాను. ఇలా టెలిగ్రామొచ్చింది, మదరిల్లాకి బావులేదుటా, తిరుగు టపాలో పంపిస్తాను. ఓ పాతిక సర్దూ అని అడిగితే ఒహడూ విదపడే! పైగా మంచిదిగా అంటాడు. చివరికేది గాదని ఇంకో ఫ్రెండింటికెళ్లి అబ్బీ ఇలా బెంగుళూరులో అద్భుతమైన పిక్చరాడుతుందిటా, మరి నేను వెళ్లి చూడాలని ఫ్రెండు టెలిగ్రాం కొట్టాడూ, నువ్విస్తేనేగాని వల్లకాదూ అవటా అన్నాను. ఠంగున పాతికా చేత పెట్టి, అవస్థపడతావేమో మరో పది పుచ్చుకోరాదా అని కాళ్లావేళ్లా

బ్రతిమాలాడు సినీ పతివ్రతలాగ. వద్దుపో అని తూలిపడేలా తూలనాడి తన్ని ఇవతలికివచ్చి పొట్ట చెక్కలయేలా నవ్వుకున్నా. అంతలో ఇంకో మిత్రుడు కనుపించాడు.

ఇవాళ శారద మా హాస్టలు వీధిలోంచి వాళ్ళ నేస్తురాలింటికి వెళ్లబోతున్నట్లు నాకు తెలిసింది. దారిలో కాంక్రీటు పూసి బంగారు మలామావేసి జెండాలుకట్టి బాజాభజంత్రీలు పెట్టి లాండ్రి వాడికి పాతబాకీ అరణాలు తీర్చేసి ఓ జత ఇస్త్రీ గుడ్డలు తెచ్చుకొని, విలాసానికోసారి భోంచేసి వీధి మొగలో నిలబడి..... అంటూ చెప్పకుపోయేసరికి వాడు ఇరవైనాలుగుం బేడా ఇచ్చి విష్‌యు గుడ్‌లక్ అని వెళ్ళిపోయాడు. కాబట్టి గుర్నాధమూ ఇంకనైనా కదులు అని పౌచ్చరించాడు అప్పారావు.

అయినా ఈ కథలాగే గుర్నాధమూ అంగుళం కూడా కదల్లేదు. బాబోయ్ నాకు భయమేస్తోంది, అడిగితే వాళ్ళేమంటారన్నది ఊహించిన కొద్దీను. నాకు సినిమా వద్దు, భానుమతీ వద్దు. మా నాన్నకి తెలిస్తే మక్కెలిరగదంతాడు అని పరుగెత్తబోయాడు గుర్నాధం.

అప్పారావు అతని కాలరు పట్టుకు ఆపేసి, క్రాఫింగు చెరిపేసి, బలవంతాన అతని కుడికాలు బోడు ఊడదీసి అది తాను తొడిగేసుకొని తనది అతనికి మార్చి బ్రదర్, కసబియాంకాలా ఇక్కడే వుండు, భయపడకు, నే తెస్తాను అంటూ ఉత్సాహంగా నాలుగడుగులు నడచి దారికడ్డుపడ్డ శాల్తీకి అడ్డపడి హలో సర్ యునో గుర్నాధం–మీరు గుర్నాధాన్నెరుగుదురా? ఉంగళకు గుర్నాధం తెరియుమా? ఆప్ గుర్నాధ్‌కో జాన్తేహై? తమకి గుర్నాధం గొత్తా? గుర్నాధనే తాంగళ్‌కు అరయామో? వాట్? అన్నాడు కళ్ళు చక్రాల్లా తిప్పి.

ఏందయ్య నీగోలా అన్నాడాయన.

ఓ చెలుగేనా మీది! సార్ మీదేవూరన్నారు?

నేనేం అనలేదే.

లేదా, పోనీయండి. అలా నిష్కర్షగా చెప్పాలి. ఐ లైక్ యు. యూ వే యేమిటి, ఫ్రాంకుగా సూటిగా నిర్మొహమాటంగా నిజం చెప్పేవాళ్ళన్నా, సత్యాన్ని పాలించేవారన్నా అడపా తడపా ఐదూ పదీ సర్దేవారన్నా నేను ప్రాణం పెడతానంటే నమ్మండి.

నమ్మను అన్నాడాయన.

అరే! నిజం? మీమీద నాకు గౌరవం క్షణక్షణానికీ పెరిగిపోతోంది చక్రవర్తిలా. నన్ను నమ్మకపోతే పోయెగాని గుర్నాధాన్ని నమ్మండి. గొడ్డు జెంటిల్‌మన్. అప్పు కావాలా అని అడిగినా పుచ్చుకుందుకి సిగ్గుపడతాడు. మునసబుగారబ్బాయి, ఏ వూరో గుర్తులేదులెండి. ఇపుడతనికి అర్జెంటుగా టూ రుపీస్ కావాలి. టి.యం.ఓ. రాగానే ఎడ్రసిస్తే మీకు నేనే తెచ్చిస్తా, ఇస్తారుగదూ.

ఇవ్వను అన్నాడాయన అప్పారావుని ఎగాదిగా చూసి. ఇవ్వరా! హా! మీకు నిర్మొహమాటమే కాక మంచి హ్యూమరుకూడా ఉందే – చూట్టానికలా ఉన్నా. తెండి, బలేవారే పైమైపోతూంది అన్నా డప్పారావు చనువుగా.

ఇవ్వను.

అదేవిటండీ హాస్యం అయిపోయిందిగా, నిజంగా ఇవ్వరేమిటి, నన్నెరగరా.
ఎరగను.
దానికేముంది మనమంతా ఓ కథలో వాళ్ళం, ఆపాటి నమ్మకపోతే ఎలా?
నాకు తెలీదు.
మీరిస్తారని చెప్పి పంపాడే!
ఎవడు వాడు?
ఈ కథ రాస్తున్నవాడు.
వాడి మొహం, ఇవ్వనన్నానని చెప్పు.

ఎక్కడో పోకిరీ రౌడీ కారెక్టర్లా ఉన్నావయ్యా. దాచుకో. నీ దగ్గిర ఎంత డబ్బున్నా ఖర్చు పెట్టేందుకు వీల్లేకుండా చేయిస్తా నుండు అథరుతో చెప్పి. హూఁ అంటూ అప్పారావు ఇంకో శాల్తీని చూసి హలో అని అటు తిరిగి ఓ టు రూపీస్–అన్నాడు.

మూండ్రూబాసార్. ఒణ్ ఫోర్ అన్నాడు వాడు.

ఆలస్యం తగదని, రూపాయ పావలా టిక్కెట్లు రెండు తమ దగ్గరున్న మూడు రూపాయలకి బ్లాకులో కొనేసి గుర్నాధం అతనూ హాల్లోకి వెళ్ళిపోయారు. అక్కడ స్థిమితంగా ప్రయత్నించి ఇంటర్వెల్‌లోనైనా రూపాయ పధ్నాలుగణాలు కొనుక్కుపోవచ్చునని.

సినిమాలో చీకట్లో అప్పారావు పక్కవాడి చెవిలో జోరీగలా పోరీపోరీ డాక్యుమెంటరీ అయేవరకూ వాణ్ణి హోరెత్తించాడు. అసలే ఇంగ్లీషు పిక్చరు. అందులో పక్కవాడి ఝుణగుణధ్వని. ఇక కథేం తెలిస్తుందని దిగాలుపడి అతను లొంగిపోయాడు.

చీకటిలో నా మొహం మీకు కనబడడం లేదుగానీ, మీరు నన్నెరుగుదురు. నేను మీ ఇల్లెరుగుదును. ఇప్పుడు కాదన్నారంటే ఆనక వెలుగులో నన్ను గుర్తుపట్టాక నాలిక్కరిచేసుకొని భోరున ఏడిచేస్తారు నాకేం అన్నాడు అప్పారావు.

ఏందయ్యా నీ గోల అన్నాడాయన.

హా లక్కి! మీరు ... మీరు తెలుగు పీపులేనన్నమాట. ప్రాణం లేచొచ్చింది–తెలుగు మాటవినగానే. మెడ్రాస్‌లో తెలుగూస్ లేరన్న గూస్ ఎవడూ? ఇంతమందితో ఇలా కిక్కిరిసి పోతూంటే. వాడి పేరూ ఎడ్రసూ చెప్పండి చెబుతా... మీకు తెలీదా? డోంట్‌వర్రీ! శ్రమపడకండి హాయిగా సినిమా చూడండి. చూసి ఆనందించండి. ఈలోగా జస్ట్ టూ రుపీస్ పారేసుకోండి. అవి రేపు మళ్ళీ తెల్లారేసరికి మీ గుమ్మానికే వచ్చి తలుపుకొట్టి, పలకరించి ఎత్తుకోమని, జేబులోకెక్కి కూర్చుంటాయి. అద్భుతంలెండి...యస్సార్ మై నేమీజ్ అప్పారావు–థాంక్యూ...రేపొద్దున్న, టుమారో మార్నింగ్...పదవోయ్ గుర్నాధం కమాన్ అంటూ తనులేచి, గుర్నాధాన్ని వెంటబెట్టుకు బయటపడి రూపాయపధ్నాలుగణాలకి టిక్కెట్టు మార్చేశాడు అప్పారావు.

గుర్నాధం ఆ క్షణాన ఈ లోకంలో లేడు. అప్పారావు హడావుడి చూసి కళ్ళు తిరిగిపోయి విభ్రాంతుడై ఉన్నాడు. టిక్కెట్లు మార్చిడి అయ్యేవరకు మేలుకొని ఎవర్రా అది? నీకు అప్పిచ్చినాయన ఎవరూ? అన్నాడు మెల్లిగా.

అప్పారావు వులిక్కిపడ్డాడు. అరెరె పొరపాటై పోయింది. పేరు అదీ కనుక్కోలేదే. సారీ...అన్నాడు.

గుర్నాధం తెల్లబోయాడు. ముక్కూ మొహం ఎరగని వాడి దగ్గర అప్పచేశావా? అన్నాడు.

ఆ దాందేముందిలే–ఇదివరకెరక్కపోతే ఇప్పుడు తెలుసుకుందాం. పరిచయాలు, స్నేహాలు, అంతర్జాతీయ సంబంధాలు ఎలా పుట్టి పెరిగి విరుగుతాయని! అప్పులు మూలాన్నే కదా! అప్పడక్కపోతే వాడెవడో మనమెవడో. డోంట్ వర్రీ నాకు నీతీ గట్రా ఉందిలే. సప్తసముద్రాలు గాలించైనా–

ఏమీ అక్కరలేదు. రూపాయ పావలా క్లాసులోకి మళ్ళీ వెళ్లి, ఇందాక మనం కూర్చున్నచోటు వెతుకు చాలు. అక్కడే ఉంటారు. క్షమాపణ చెప్పుకొని, కాళ్లు పట్టుకొని హోస్టలుకు లాక్కురా. నేను కూడా నీ మూలాన వాడికాళ్ళమీద పడతాను. ఎంత అపర్దిష్ట! సిగ్గులేదురా. ఆ మధ్య ఉండేదనేవాడివీ! అదంతా ఏం చేశావురా? అన్నాడు గుర్నాధం మండిపడుతూ.

బావుంది ఇంకెక్కడుందోయ్! సిగ్గు విడిచి రెండేసిసార్లు అడిగితే తప్ప మీ రప్పా లివ్వరు. ఎప్పుడో నిండుకుంది కాబోలు అన్నాడు అప్పారావు.

ఛప్ ముందెళ్ళి ఆ పెద్దమనిషిని వెతికి కాళ్ళమీద పడు...ఇదంతా మా నాన్నకి తెలిస్తే–

అప్పారావు అర్జంటుగా లోపలికెళ్లి, తొలిసారిచ్చిన చేబదులు డబ్బులా వెంటనే ఠంగున తిరిగి ఇవతల కొచ్చేశాడు పొడావిడిగా.

మళ్ళీ ఎందుకొచ్చావు వెళ్ళు అని గదమాయించాడు గుర్నాధం. ఈ సారి మెల్లిగా లోనికెళ్ళి అప్పిచ్చిన పెద్దమనిషి పక్కన కూర్చుని సార్ క్షమించాలి అన్నాడు వినయంగా.

మళ్ళీ వచ్చా? ఎవడ్రా నువ్వు. ఇందాక నా చేతిలోంచి రెండు రూపాయలు లాక్కున్నది నువ్వేనా?

అఫ్‌కోర్సు, నేనేనండి, నేను అబద్ధమాడను, అది చేతనైతే –

నాయనా నీకూ నీపెద్దలకీ ఓ దండం. ఇక్కణ్ణుంచి పోరాదూ?

నోసార్! తమరు ఒక్కసారి మా హోస్టలుకు దయచేస్తే మా గుర్నాధం మీ కాళ్ళమీద పడాలని మహా యిదవుతున్నాడండి.

అయన చీకటిలోనే తెల్లబోయాడు. వాడెవడు? వాడి కదేం బుద్ధి అన్నాడు.

తెలీదండి. కానీ ఒకటి గుర్తుంచుకోండి. మా గుర్నాధానికేదేం హాబీ కాదు–ఇలా అందర్నీ హోస్టలుకు పిలిచి వాళ్ళ కాళ్ళమీద పడడం. ఏదో ఈ సారి సరదా పుట్టింది. ఉన్న వాటిలో మీవి బెష్టని ఎన్నికచేసి ఉంటాడు. నా ఒపీనియన్ అడిగితే భానుమతి పాదాలు సజెస్టు చేసేవాణ్ణి. తమలపాకుల్లా...

పెద్దాయనకి సంగతి బోధపడింది. అప్పారావుకేసి ఆ చీకట్లోనే జాలిగా చూశాడు. ఆయన గుండె తరుక్కుపోయింది.

ఔనౌను. అవే మెరుగు. నేనూ చూశాను. ఆ మాటా నిజమే. బయటికి పద....మీ వాడి పేరేమిటన్నావు...వాడితో చెబుదాం....దా....మ్మ దా అంటూ అప్పారావును వెంటబెట్టుకొని ఇవతలి కొచ్చాడు.

అల్లంత దూరాన్నుంచి వాళ్ళిద్దర్నీ చూసిన గుర్నాధం గుండె గుభేలుమంది.

అమ్మబాబోయ్ అనేందుకు కూడా వ్యవధి చాలక స్తంభం చాటుకు తప్పుకుని, వారిద్దరినీ సంస్మరించి అలా చాటునుండే గేటువైపు సాగి అక్కడ ముడుచుకొని, అవతలపడి విశాల ప్రపంచంలో కలిసిపోయి హాస్టలు కెళ్ళిపోయి బనీను కూడా మార్చేసి తలపాగా చుట్టుకొని పడుకున్నాడు గుర్నాధం.

అరగంట తరవాత అప్పారావు వచ్చాడు ఉత్సాహంగా.

తానొక్కడే వచ్చాడని కాళ్ళాయన–గుర్నాధం కాళ్ళమీద పడదామనుకున్నాయన–(అంటే గుర్నాధం కాళ్ళమీద కాదు) రాలేదని ఒట్లు సత్యాలు పెట్టాక తలుపుతీశాడు.

కానీ అప్పారావు ఒక్కడూ రాలేదు! అతనితో పెద్ద ముప్పొకటొచ్చి పడింది.

ఆయన కాళ్ళమీద పడే ఛాన్సు ప్రస్తుతానికి వాయిదా పడింది. కాని బాధపడకు. నిరాశతో, నిస్పృహతో కుంగి కుమిలిపోకు. తప్పకుండా నీకా అవకాశం కలుగుతుందని ఆయన గ్యారంటీ ఇచ్చాడు. అసలు నీ కలాటి ఊహ రావడమే ఎంతో అద్భుతంగా ఉందనీ, శుభసూచన అనీ, ఆనందం కలిగించిందనీ ఆయన అన్నాడు. ఐదు రూపాయలు సర్దారుకూడా పాపం. మళ్ళీ రేపిస్తానంటే, వద్దు చంపేస్తానన్నాడు. అంతగా అయితే ఏడాదికో పదేళ్ళకో ఈ జన్మ చివరికో నా దగ్గిర డబ్బు మరీ ఎక్కువ అయిపోయి దానధర్మాలు గట్రా చేసినపుడు కావాలంటే ఓ నోటు తనమీద పారెయ్యొచ్చునన్నాడు. ఇలాటివాడూ...ఇంత మంచి మావగారూ మన కెక్కడ దొరుకుతారురా? ఇంత ఉదారుడు, దానశీలి...శిబి, దధీచి, మహారధి కర్ణా అన్నాడు అప్పారావు.

★ ★ ★